



RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM



**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7569677170



ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :293 | సంపాదకులు: కలిచేటి వెంకయ్య | శనివారం 19 సెప్టెంబర్ 2026 | పేజీలు: 8 | వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad


# పన్నుల వసూళ్లలో భారీ జోరు

రూ.12.12 లక్షల కోట్లు దాటిన ఆదాయం!

నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 13 శాతం పెరుగుదల

స్థూల పన్ను వసూళ్లు రూ.14.3 లక్షల కోట్లు

కార్పొరేట్ పన్నులో 19.48 శాతం వృద్ధి

ఎస్టీటీ వసూళ్లలో 53 శాతం పెరుగుదల

అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు 16.18 శాతం పెరుగుదల

ద్రవ్యలోటు లక్ష్యంలో 26.8 శాతం నమోదు



**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వానికి పన్నుల ఆదాయం భారీగా పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 17 వరకు నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 13 శాతం పెరిగి రూ.12.12 లక్షల కోట్లకు చేరాయి. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) శుక్రవారం విడుదల చేసిన గణాంకాల్లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ఇదే సమయంలో స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు 15 శాతానికి పైగా పెరిగి రూ.14.3 లక్షల కోట్లకు చేరాయి. కార్పొరేట్ పన్ను వసూళ్లు 19.48 శాతం పెరిగి సుమారు రూ.5.56 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. వ్యక్తిగత ఆదాయ పన్ను, హిందూ అవిభక్త కుటుంబాల (హెచ్యూఎఫ్) నుంచి వచ్చిన వసూళ్లు 6 శాతం పెరిగి రూ.6.16 లక్షల కోట్లకు పైగా చేరాయి. సెక్యూరిటీస్ మిగతా 2లో...

# కడప జిల్లాకు కేంద్రం గుడ్న్యూస్

రూ.304 కోట్లతో కొత్త హైవే

వైఎస్సార్ కడప జిల్లాకు రూ.304.44 కోట్లు

మంజూరు చేసిన కేంద్రం

కొప్పర్తి ఇండస్ట్రియల్ ఏరియాను కడప బైపాస్కు

కలుపుతూ కొత్త హైవే

5.8 కిలోమీటర్ల పొడవున 4-లేన్ల గ్రీన్ఫీల్డ్ రహదారి నిర్మాణం

కడప నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గించి,

పారిశ్రామిక అభివృద్ధికి దోహదం

గతిశక్తి కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాజెక్టుకు ఆమోదం



**న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్లోని వైఎస్సార్ కడప జిల్లా పారిశ్రామిక ప్రగతికి కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామిక ప్రాంతాన్ని కడప బైపాస్కు అనుసంధానించేలా 4-లేన్ల గ్రీన్ఫీల్డ్ రహదారి నిర్మాణానికి రూ.304.44 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా వివరాలను వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 5.8 కిలోమీటర్ల పొడవున 'యాక్సెస్ కంట్రోల్డ్ హైవే'ను నిర్మించనున్నారు. ఇందులో ఒక ట్రంపెట్ ఇంటర్ఛేంజ్, రెండు భారీ వంతెనలు, నాలుగు వెహిక్యులర్ అండర్పాస్లను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు ప్రస్తుతం ఉన్న కడప బైపాస్ను కూడా పటిష్ఠమైన షోల్డర్స్తో అభివృద్ధి చేయనున్నారు. ఈ చర్యల వల్ల పారిశ్రామిక ప్రాంతానికి రవాణా సౌకర్యాలు మెరుగుపడి, వాహనాల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్లో అనుసంధానతను మిగతా 2లో...

# దుగరాజపట్నంలో గ్రీన్ఫీల్డ్ షిప్యార్డ్

ఎండీఎల్తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం

ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఎంవోయూ

రూ.15,000 కోట్ల పెట్టుబడి..

45వేల మందికి ఉపాధి అవకాశాలు

ఏడాదికి 12 లక్షల టన్నుల భారీ నౌకల నిర్మాణ సామర్థ్యంతో షిప్ యార్డు



**అమరావతి సింధూరదర్శిని:**

ఆంధ్రప్రదేశ్ను దేశంలోనే ప్రముఖ షిప్బిల్డింగ్, మెరైన్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్గా అభివృద్ధి చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. దుగరాజపట్నంలో గ్రీన్ఫీల్డ్ షిప్యార్డ్ ఏర్పాటుకు మజగాన్ డాక్ షిప్బిల్డర్స్ లిమిటెడ్ (వీణా)తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో సచివాలయంలో ఎండీఎల్, ఏపీ మారిటైమ్ బోర్డు- విశాఖ పట్నం పోర్టు అథారిటీలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఎస్పీవీ సంస్థ నేషనల్ షిప్బిల్డింగ్ అండ్ హెవీ ఇండస్ట్రీస్ పార్క్-ఏపీ మధ్య ఈ కీలకమైన అవగాహనా ఒప్పందం జరిగింది.

**రూ.15 వేల కోట్ల పెట్టుబడితో షిప్ యార్డ్**

దుగరాజపట్నంలో ఆధునిక గ్రీన్ఫీల్డ్ షిప్యార్డ్ నిర్మాణం కోసం వచ్చే 5 ఏళ్లలో ఎండీఎల్ సుమారు రూ.15 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో సుమారు 45,000మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. షిప్బిల్డింగ్తో పాటు అనుబంధ పరిశ్రమలు, మెరైన్ ఇంజినీరింగ్, లాజిస్టిక్స్, సర్వీసెస్ తదితర రంగాల్లో పెద్దఎత్తున ఉపాధి, పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది.

**ఏడాదికి 12 లక్షల టన్నుల సామర్థ్యం**

ప్రతిపాదిత షిప్యార్డ్ ఏటా 12 లక్షల గ్రాస్ టన్నుల (1.2 మిలియన్GT) నౌకానిర్మాణ సామర్థ్యంతో రూపుదిద్దుకోనుంది. భవిష్యత్ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సామర్థ్యాన్ని మరింత విస్తరించేందుకు కూడా వీలుంది. ట్యాంకర్లు, బల్క్ క్యారియర్లు, కంటైనర్ నౌకలు, ఎల్ఎన్జీ క్యారియర్లు, ఇతర భారీ ప్రత్యేక నౌకలను నిర్మించేలా ఈ షిప్యార్డ్ను అభివృద్ధి చేయనున్నారు. దీని ద్వారా దేశీయ అవసరాలతో పాటు అంతర్జాతీయ మార్కెట్లకు కూడా నౌకలను నిర్మించే సామర్థ్యం రాష్ట్రానికి అందుబాటులోకి రానుంది.

**దుగరాజపట్నంలో సమగ్ర నౌకా నిర్మాణ క్లస్టర్**

దుగరాజపట్నంలో షిప్బిల్డింగ్-కమ్-పోర్ట్ క్లస్టర్ అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. టెక్నో-ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్ట్ (TEFR) ప్రకారం షిప్బిల్డింగ్, షిప్ రిపేర్ యార్డ్కు సుమారు మిగతా 2లో...

# బెంగాల్ ఉపపోరు

## మమత వర్గం పార్టీకి 'ఫుట్బాల్ ప్లేయర్'.. రెబల్ వర్గానికి 'ఎన్వలప్'

తృణమూల్ కాంగ్రెస్లోని రెండు వర్గాలకు కొత్త పేర్లు, గుర్తులు కేటాయింపు

మమత వర్గానికి 'మమత ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరు ఖరారు

రెబల్ వర్గానికి 'డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్'గా గుర్తింపు

మమత వర్గానికి 'ఫుట్బాల్ ప్లేయర్', ఆరుప్ వర్గానికి 'ఎన్వలప్' చిహ్నం

బెంగాల్ ఉపఎన్నికల కోసం ఈసీ తాత్కాలిక ఏర్పాటు



పశ్చిమ బెంగాల్ : అసెంబ్లీ ఉప ఎన్నికల నేపథ్యంలో, ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీలోని రెండు వర్గాలకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) నూతన పేర్లను, ఎన్నికల చిహ్నాలను కేటాయించింది. పార్టీలో తలెత్తిన అంతర్గత వర్గపోరు కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. మమతా బెనర్జీ నేతృత్వంలోని వర్గానికి 'మమత ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' అనే పేరును, మిగతా 2లో...



# నేడు సాయంత్రానికి అండమాన్ ప్రాంతంలో అల్పపీడనం

## ఏపీలో వర్షాలు

ఉత్తర అండమాన్ వద్ద ఏర్పడనున్న అల్పపీడనం

ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరం వైపు కదిలే అవకాశం

శనివారం 16 జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాల సూచన

మిగతా జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడే ఛాన్స్

ప్రజలు జాగ్రత్తగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక

**న్యూఢిల్లీ:** బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని, దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. ఉత్తర అండమాన్ పరిసరాల్లో ఉన్న ఉపరితల ఆవర్తనం రేపు (సెప్టెంబరు 19) సాయంత్రం నాటికి అల్పపీడనంగా మారే సూచనలున్నాయని ఏపీఎస్డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ అల్పపీడనం క్రమంగా బలపడి, రానున్న మూడు నాలుగు రోజుల్లో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందని ఆయన వివరించారు. మిగతా 2లో...

# జగన్‌ది 'ఎల్‌నినో' బాధ కాదు.. పచ్చి 'అబద్ధాల నినో' డ్రామా

ఎల్నినో ముప్పును ముందే గుర్తించి క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాం

'జలధార-జలహారతి'తో 79,826 పనులు పూర్తి..

భూగర్భ జలాలు 0.79 మీటర్లు పెరుగుదల

17 లక్షల మంది రైతులు స్వచ్ఛందంగా పిడిఎంఎస్ పద్ధతుల వైపు మొగ్గు

మార్కెట్ ఇంటర్వెన్షన్కు కూటమి ప్రభుత్వం రూ.800 కోట్లకు పైగా ఖర్చు

వైసీపీ హయాంలో రైతులకు చేసిందేమీ లేదు..

కాగితాలపై లెక్కలు చూపి మోసం చేశారు: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి సింధూరదర్శిని:**

ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఎల్నినో ప్రభావంతో ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, రైతులను, పంటలను కాపాడేందుకు కూటమి ప్రభుత్వం శాస్త్రీయ దృక్పథంతో సమగ్ర కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఎల్నినోను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతుంటే.. వాస్తవాలను పక్కన పెట్టి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం ఏమీ చేయలేదని జగన్ చెప్పడం పూర్తిగా అవాస్తవమని మంత్రి స్పష్టం చేశారు. ఎల్నినో ముప్పును ముందుగానే అంచనా వేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏప్రిల్ 2026లోనే 'జలధార' కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారని తెలిపారు. ముందస్తు ప్రణాళికలు, క్షేత్రస్థాయి మిగతా 2లో...

# జగన్‌ది 'ఎల్‌నినో' బాధ కాదు.. పచ్చి 'అబద్ధాల నినో' డ్రామా

(మొదటిపేజీ తరువాయి)

చర్యల ఫలితంగానే రాష్ట్రంలో భూగర్భ జలాలు 0.79 మీటర్లు పెరిగాయని వెల్లడించారు. 'జలధార-జలహారతి' కార్యక్రమం కింద కూటమి ప్రభుత్వం రూ.3,409.35 కోట్ల వ్యయంతో 79,826 పనులను పూర్తి చేసిందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యల వల్ల రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 625 టీఎంసీల భూగర్భ జలాలు అందు బాటులో ఉన్నాయని చెప్పారు. ముందస్తు చర్యలు లేకపోయి ఉంటే పరిస్థితి మరింత క్లిష్టంగా మారేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వ బకాయిలను మేమే చెల్లిస్తున్నాం..

### పంటల బీమాలో ఏపీ దేశంలోనే ముందంజ

పంటల బీమా గురించి మాట్లాడే నైతిక అర్హత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేదని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఖరీఫ్ సీజన్‌లో కేవలం మూడేళ్లు మాత్రమే పంటల బీమా ప్రీమియం చెల్లించి, రెండు సంవత్సరాలు ప్రీమియం చెల్లించకుండా వదిలేశారని, ఐదేళ్లలో రబీకి ఒక్క ఏడాది కూడా ఇన్సూరెన్స్ కట్టలేని జగన్ ఇప్పుడు నీతులు చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం బకాయిల భారాన్ని ఇప్పుడు కూటమి ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల ఏర్పడిన ఆర్థిక భారాన్ని భరిస్తూనే రైతులకు పంటల బీమా భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. పంటల బీమాను గాలికి వదిలేశామని విమర్శలు చేస్తున్న జగన్ ముందుగా తన ఐదేళ్ల పాలనలో రైతులకు ఏ మేరకు బీమా రక్షణ కల్పించారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దేశంలోనే పంటల బీమా నమోదులో ఆంధ్రప్రదేశ్ అత్యధిక శాతం నమోదు సాధించిన రాష్ట్రంగా నిలిచిందని, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బీమా ప్రీమియం నిధులను ముందుగానే ఎస్క్రో ఖాతాలో అందుబాటులో ఉంచామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ముందుచూపుతో తీసుకున్న చర్యల ఫలితంగా తొలిసారిగా సుమారు రూ.16వేల కోట్ల విలువైన పంటలకు బీమా నమోదు జరిగిందని మంత్రి వెల్లడించారు. రైతులకు ప్రకృతి వైపరీత్యాల నుంచి ఆర్థిక భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, రైతు సంక్షేమంపై చిత్తశుద్ధితో పనిచేస్తున్న తమ ప్రభుత్వాన్ని విమర్శించే ముందు వైసీపీ తన హయాంలో రైతులకు చేసిన అన్యాయానికి సమాధానం చెప్పాలని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

### ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు శాస్త్రీయంగా పంచసూత్రాల అమలు

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పరిస్థితిని ముందుగానే అంచనా వేసి ఫిబ్రవరి 2026 నుంచే కూటమి ప్రభుత్వం ముందస్తు కార్యాచరణను ప్రారంభించిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. జూన్-ఆగస్టు కాలంలో సాధారణ వర్షపాతం 350 మి.మీ. కాగా ఇప్పటివరకు 170.9 మి.మీ. మాత్రమే నమోదైందని, రాష్ట్రంలో వర్షపాత లోటు 51.2 శాతంగా ఉండగా దేశవ్యాప్తంగా ఇది సుమారు 13 శాతమేనని వివరించారు. పంట నష్టం జరిగిన తర్వాత స్పందించే విధానానికి భిన్నంగా, శాస్త్రీయ సమాచారం, శాటిలైట్ పర్యవేక్షణ, జలాశయాల నీటి నిల్వలు, నేల తేమ, పంటల పరిస్థితి, విత్తనాలు, సాగు పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ రైతు కేంద్రిత ముందస్తు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఇందులో భాగంగా ప్రాంతం-రైతు కమతం ఆధారిత వ్యూహం, PMDS--Seed Pelleting, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక, 'రైతన్న మీ కోసం' ఎల్‌నినో మిటిగేషన్ ప్లాన్, పంటల బీమా ద్వారా ఆర్థిక రక్షణఅనే పంచసూత్రాలను అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 8,489 రైతు సేవా కేంద్రాల పరిధిలో 1,357 RSK\ను High Riskగా, 2,077 RSKలను Moderate Riskగా గుర్తించి, ాూా+ూా, శాటిలైట్ సమాచారం, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా రైతు కమతాలను Normal, Watch, Alert కేటగిరీలుగా విభజించి కమతం వారీగా ప్రత్యేక సలహాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. వర్షాధార ప్రాంతాల్లో PMDS, Seed Pelletingను ప్రోత్సహిస్తూ సుమారు 23 లక్షల మంది రైతులు 25 లక్షల ఎకరాల్లో ఈ విధానాలను అనుసరిస్తున్నారని, PMDSను Green Fodder Managementతో అనుసంధానించి పశుగ్రాస కొరతను నివారిస్తున్నామని తెలిపారు. జలాశయాలు, నదీ ప్రవాహాలు, సాగునీటి లభ్యతను అంచనా వేసి అధిక నీరు అవసరమయ్యే వరికి ప్రత్యామ్నాయంగా పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, స్వల్పకాలిక పంటలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఆగస్టు 7, 2026న ప్రారంభించిన 'రైతన్న మీ కోసం-El Nio Mitigation Plan' ద్వారా 46.86 లక్షల మంది రైతులకు సంబంధించిన 2.75 కోట్ల కమతాలను పరిశీలిస్తూ వ్యవసాయ, రెవెన్యూ, జలవనరులు తదితర శాఖల సమన్వయంతో ప్రతి కమతంలోని పంట, నీటి లభ్యత, నేల తేమ, పంట దశ, ప్రమాద స్థాయిని అంచనా వేసి Farmer Parcel-Specific Advisory అందిస్తున్నామని తెలిపారు. అదే విధంగా పంటల బీమాను మరింత విస్తరించి 2025లో 19.5 లక్షలుగా ఉన్న బీమా దరఖాస్తులను 2026లో 35.15 లక్షలకు పెంచామని, బ్యాంకు రుణాలు తీసుకోని Non-Loanee Farmersను కూడా బీమా పరిధిలోకి తీసుకురావడంతో వారి సంఖ్య 2 లక్షల నుంచి 27.5 లక్షలకు పెరిగిందని, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, పట్టు తదితర అనుబంధ రంగాల్లోనూ నీటి పొదుపు, తేమ సంరక్షణ, పశుగ్రాసం, నీటి కొరత నివారణ, పంట-పశు రక్షణ చర్యలు చేపడుతున్నామని, గత ఏడాది 15,303గా ఉన్న Animal Sheltersను ఈ ఏడాది 20,000కు పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు.

### రాయలసీమను 'రతనాల సీమ'గా తీర్చిదిద్దుతాం.. రూ.లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్

వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ అభివృద్ధిపై కనీసం ఒక్క సమీక్ష సమావేశమైనా నిర్వహించారా అని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. వ్యవసాయాన్ని అత్యంత ప్రాధాన్య రంగంగా భావిస్తున్నందుకే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నెలకు రెండుసార్లు వ్యవసాయ రంగంపై సమీక్షలు నిర్వహిస్తూ, రైతుల సమస్యలు, సాగునీరు, నీటి సంరక్షణ, పంటల పరిస్థితి, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధిపై నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని 'వాటర్ మ్యాన్' అని ఊరికే అనలేదని, నీటి వనరుల సంరక్షణ, సమర్థ వినియోగానికి ఆయన ఇస్తున్న ప్రాధాన్యతే అందుకు నిదర్శనమన్నారు. వైసీపీ హయాంలో మైక్రో ఇరిగేషన్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో సుమారు రూ.1,100కోట్ల బకాయిలు పేరుకుపోయాయని, వాటిని ఇప్పుడు కూటమి ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డ్రిప్, మైక్రో ఇరిగేషన్ విస్తరణకు పెద్దపీట వేసి, ఈ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపామని వెల్లడించారు. ప్రతి నీటి బొట్టును సమర్థవంతంగా వినియోగించుకోవడం,భూగర్భ జలాలను సంరక్షించడం, రైతులకు సాగునీటి భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. రాయలసీమకు తాగు, సాగునీరు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషిని మాజీ ముఖ్యమంత్రి జగన్ విమర్శించకుండా ఉంటే సీమప్రజలు హర్షిస్తారని మంత్రి వ్యాఖ్యానించారు. రాయలసీమను 'రతనాల సీమ'గా తీర్చిదిద్దే లక్ష్యంతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని తెలిపారు. ప్రభుత్వ పరిధిలో సుమారు రూ.40వేల కోట్లు, ప్రైవేట్ రంగంలో మరో రూ.60వేలకోట్ల పెట్టుబడులతో మొత్తం రూ.1లక్ష కోట్ల మేర పెట్టుబడులను ఆకర్షించి హార్టికల్చర్ హబ్‌ను అభివృద్ధి చేయనున్నామని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. వ్యవసాయం, సాగునీరు, ఉద్యానవన రంగాలను సమగ్రంగా అభివృద్ధి చేసి రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు రాయలసీమ ప్రాంత ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది వేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

### రైతుల కోసం ముందుగానే విత్తనాల సిద్ధం

వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేసిందని మంత్రి చెప్పారు. మొదటి విడతలో 47,321 క్వింటాళ్ల విత్తనాలను సిద్ధం చేయడంతో పాటు, ఆగస్టు 15 తర్వాత ఏర్పడే అదనపు అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో 1.12 లక్షల క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఆగస్టు 3 నుంచే ఆర్ఎస్‌కేలు, మండల స్థాయిలో 'రైతన్నా మీకోసం' వారోత్సవాల ద్వారా ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. అదేవిధంగా 6.30 లక్షల హెక్టార్లలో ౢావీఖీఢ్, =ఔదీజ×ూ కింద పంటల బీమా కవరేజీ కల్పించామని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వరి బీమా నమోదుకు గడువును ఆగస్టు 31 వరకు పొడిగించామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఐదు నెలలకు సరిపడా పశుగ్రాసం అందుబాటులో ఉందని మంత్రి తెలిపారు. పశుగ్రాసం అధికంగా ఉన్న ప్రాంతాల నుంచి కొరత ఉన్న జిల్లాలకు తరలించేందుకు ఇప్పటికే స్పష్టమైన ట్రాన్స్‌పోర్ట్ ప్లాన్‌ను సిద్ధం చేశామని చెప్పారు. పశువులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు.

### తెలంగాణ అక్రమ ప్రాజెక్టులపై జగన్ ఎందుకు మౌనం వహించారు?

వైసీపీ ఐదేళ్ల పాలనలో తెలంగాణ ప్రభుత్వం అక్రమ ప్రాజెక్టులు నిర్మిస్తున్న సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు మౌనం వహించారని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాల్లో అప్పటి ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టలేదని విమర్శించారు. రైతులు, వ్యవసాయం, నీటి వనరుల ప్రయోజనాలను కాపాడటంలో కూటమి ప్రభుత్వం నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రకృతి విపత్తులు, వాతావరణ మార్పుల వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు శాస్త్రీయ విధానాలను అనుసరిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రతి రైతును.. ప్రతి పంటను కాపాడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం రాత్రింబవళ్లు పనిచేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## పన్నుల వసూళ్లలో భారీ జోరు

(మొదటిపేజీ తరువాయి)

ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ) వసూళ్లలోనూ భారీ పెరుగుదల కనిపించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 53 శాతం పెరిగి రూ.40,214 కోట్లకు చేరాయి. పన్ను రిఫండ్ల జారీ కూడా 29 శాతానికి పైగా పెరిగి రూ.2.2 లక్షల కోట్లను దాటింది. మరోవైపు సెప్టెంబర్ 17 వరకు అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు 16.18 శాతం పెరిగి రూ.5.22 లక్షల కోట్లకు చేరాయి. ఇందులో కార్పొరేట్ అడ్వాన్స్ ట్యాక్స్ 18 శాతం పెరిగి రూ.4.16 లక్షల కోట్లుగా, నాన్-కార్పొరేట్ అడ్వాన్స్ ట్యాక్స్ 9.24 శాతం పెరిగి రూ.1.06 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇక ఏప్రిల్-జూలై మధ్య నాలుగు నెలల్లో కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు రూ.4.55 లక్షల కోట్లుగా ఉంది. పూర్తి ఆర్థిక సంవత్సర లక్ష్యంలో ఇది 26.8 శాతం. గత ఏడాది ఇదే కాలంలో ద్రవ్యలోటు రూ.4.7 లక్షల కోట్లు ఉండగా.. ఈసారి కొంత తగ్గింది. 2026-27లో ద్రవ్యలోటును జీడీపీలో 4.3 శాతానికి పరిమితం చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

## కడప జిల్లాకు కేంద్రం గుడ్‌న్యూస్

(మొదటిపేజీ తరువాయి)

బలోపేతం చేయడంలో ఈ రహదారి కీలక పాత్ర పోషించనుంది. అంతేకాకుండా, కడప నగరంలో ట్రాఫిక్ రద్దీని గణనీయంగా తగ్గించడానికి ఇది దోహదపడుతుంది. 'ప్రధాని గతిశక్తి' కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఈ ప్రాజెక్ట్, ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి ఊతమిస్తుందని కేంద్రం భావిస్తోంది. కొప్పర్తి పారిశ్రామిక హబ్ శరవేగంగా అభివృద్ధి చెందడానికి ఈ కొత్త రహదారి ఒక మైలురాయిగా నిలుస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్



(మొదటిపేజీ తరువాయి)

రూ.29,254కోట్లు, పోర్టు అభివృద్ధికి సుమారు రూ.9,513 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. దుగరాజపట్నం పోర్టును కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేసేందుకు ఆమోదం తెలిపింది. షిప్‌బిల్డింగ్ క్లస్టర్‌ను కూడా కేంద్ర ప్రభుత్వ షిప్ బిల్డింగ్ డెవలప్మెంట్ స్కీం కింద అభివృద్ధి చేయనున్నారు. ఈ క్లస్టర్‌కు మాజగాంవ్ డాక్ యార్డ్ లిమిటెడ్ ను యాంకర్ షిప్‌యార్డ్‌గా ఎంపిక చేశారు. జాతీయ షిప్‌బిల్డింగ్ లక్ష్యాలకు అనుగుణంగా భారత్‌ను 2047 నాటికి ప్రపంచంలోని అగ్రశ్రేణి షిప్‌బిల్డింగ్ దేశాల్లో ఒకటిగా నిలబెట్టాలన్న జాతీయ లక్ష్యానికి దుగరాజపట్నం ప్రాజెక్టు దోహదపడనుంది. మారిటైమ్ అమృత్ కాల్ విజన్ 2047, కేంద్ర ప్రభుత్వ షిప్ బిల్డింగ్ డెవలప్మెంట్ స్కీం లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. ఈ ఒప్పంద కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఎండీఎల్ సీఎండీ జగ్మోహన్, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చైర్‌పర్సన్ జస్మీత్ సింగ్ బింద్రా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బెంగాల్ ఉపపోరు

(మొదటిపేజీ తరువాయి)

'ఫుట్‌బాల్ ప్లేయర్' గుర్తును ఈసీ కేటాయించింది. అదే సమయంలో, అరూప్ రాయ్ నేతృత్వంలోని అసమ్మతి వర్గానికి 'డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్' అనే పేరును ఖరారు చేస్తూ, 'ఎన్వలప్' గుర్తును కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అంతకుముందు సెప్టెంబర్ 17న, టీఎంసీ అసలు పేరును, చిహ్నాన్ని ఈ రెండు వర్గాలు ఉపయోగించకుండా ఎన్నికల సంఘం తాత్కాలిక నిషేధం విధించింది. పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్, రెజీనగర్ నియోజకవర్గాలకు అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికల దృష్ట్యా ఈ చర్యలు చేపట్టింది. దీంతో రెండు వర్గాలు తమకు నచ్చిన పేర్లు, గుర్తుల జాబితాను ఈసీకి సమర్పించగా, వాటిని పరిశీలించిన అనంతరం ఎన్నికల సంఘం తాజాగా ఈ కేటాయింపులు చేసింది.

## నేడు సాయంత్రానికి అండమాన్ ప్రాంతంలో అల్పపీడనం.. ఏపీలో వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటాయని అంచనా వేస్తున్నారు. శనివారం రోజున మన్యం, అల్లూరి, పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ తెలిపింది. మిగిలిన జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి జల్లులు పడతాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో, వర్షాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు, పశువుల కాపరులు చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని హెచ్చరించింది.

## ఈవీఎం గోదామును పరిశీలించిన కలెక్టర్



ఒంగోలు, సింధూరదర్శిని: జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు శుక్రవారం స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోదాములను పరిశీలించారు. త్రైమాసిక తనిఖీలలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాముల తలుపులు తెరిచి, వాటిలో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించారు. వాటి స్థితిగతులను, భద్రపరిచిన తీరు, ఈ ప్రాంగణంలో కల్పించిన పోలీస్ సెక్యూరిటీపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట డిఆర్ఓ పీవీ రమణ, టిడిపి ప్రతినిధి కె.అంకరాజు, బిజెపి ప్రతినిధి ఆర్. అజయ్ కుమార్, వైయస్సార్ సిపి ప్రతినిధి పి.రాజీవ్, కాంగ్రెస్ ప్రతినిధి రసూల్, బీఎస్పీ ప్రతినిధి ఎన్.రవికుమార్, జిల్లా ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.







## శేష వాహనంపై విహరించిన సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి

కాణిపాకం( సింధూర దర్శిని) 18 సెప్టెంబర్ చిత్తూరు జిల్లా; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం చిన్న శేష వాహనంపై విహరించిన సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి వారు, ఉదయం శేష వాహనం సందర్భంగా

### ఆలయ ఈవో పెంచల కిషోర్

శతకళసాలతో వైభవంగా కోలాటాలు మేలు తాళాలు నడుమ కాణిపాకం పురవీధుల్లో కలశాలతో ఊరేగింపు నిర్వహించి ఆలయంలోని కళ్యాణ వేదిక వద్ద స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకములు జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి పాల్గొన్న పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ , ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, మరియు ఈవో పెంచల కిషోర్, బోర్డు సభ్యులు, ఆలయ అధికారులు ఉభయదారులు తదితరులు పాల్గొన్నారు.









## అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన మంత్రి ఆనం

### విద్యార్థులు, ఉపాధ్యాయులకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత

ఆత్మకూరు( సింధూర దర్శిని) 18 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; ఆత్మకూరులో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుక్రవారం పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆత్మకూరులోని వెస్ట్ ఎంపీపీఎస్ పాఠశాల ప్రాంగణంలో రూ.28.30 లక్షల వ్యయంతో నిర్మించిన భవిత భవనాన్ని చిన్నారులతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో రూ.53 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక వనరుల కేంద్రం (ఎంఆర్‌సీ), మండల విద్యాశాఖాధికారి కార్యాలయ భవనాన్ని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యా రంగంలో అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసి వెంకటసుబ్బయ్య, విద్యాశాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పై అవగాహన

### – కమిషనర్ వై ఓ.నందన్ –



నెల్లూరు( సింధూర దర్శిని) 18 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; స్వచ్ఛతా హి సేవ – 2026 లో భాగంగా " స్వచ్ఛ పాఠశాల – యూత్ ఫర్ స్వచ్ఛత" కార్యక్రమాన్ని స్థానిక వి.ఆర్ మున్సిపల్ పాఠశాల, మూలాపేట డి.ఎస్.ఆర్ పాఠశాలల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. వి.ఆర్ పాఠశాల ప్రాంగణంలో నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు పాఠశాల ప్రాంగణాలను, పరిసరాలను పరిశుభ్రం చేశారు. విద్యార్థులలో వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని కమిషనర్ తెలిపారు. డి.ఎస్.ఆర్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వాసు బాబు హాజరై విద్యార్థితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ దినేష్,వివిధ డివిజన్లకు చెందిన వార్డు సచివాలయాల కార్యదర్శులు, పి.ఎమ్.యు. బృందం పాల్గొన్నారు.

## వందే భారత్ రైలుకు స్టాపింగ్ కోసం వినతి

### రాజ్యసభ సభ్యులు డాక్టర్ బీద మస్తాన్‌రావుయాదవ్‌కి వినతిపత్రం ఇచ్చిన మయూరి శ్యామ్ యాదవ్



గూడూరు (సింధూర దర్శిని) 18 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; రాజ్యసభ సభ్యులు డాక్టర్ బీద మస్తాన్ రావు యాదవ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి, గూడూరులో వందే భారత్ రైలుకు స్టాపింగ్ కల్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించినట్లు శ్రీకృష్ణ సేవా సమితి ఫౌండర్ చైర్మన్ మరియు సౌత్ సెంట్రల్ రైల్వే, విజయ వాడ రైల్వే డివిజన్ మాజీ మెంబర్ డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ తెలిపారు. సికింద్రా బాద్ నుండి గూడూరు మీదుగా తిరుపతికి వెళ్లే వందే భారత్ రైలుకు గూడూరు జంక్షన్‌లో స్టాపింగ్ కల్పించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. గూడూరు రైల్వే జంక్షన్ ప్రాధాన్యతను వివరిస్తూ, గూడూరుకు అతి సమీపంలో శ్రీహరికోట (షార్), శ్రీ సిటీ సెజ్, మేనకూరు సేజ్ నూతనంగా ఏర్పాటు కానున్న క్రిస్ సిటీ, దుగరాజపట్నం ఓడరేవు, ఉన్నాయని, అంతేకాకుండా కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులు గూడూరు రైల్వే స్టేషన్ చేరుకొని రోడ్డు మార్గం ద్వారా తిరుపతికి వెళుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు.దీనికి సానుకూలంగా స్పందించిన రాజ్యసభ సభ్యులు డాక్టర్ బీద మస్తాన్ రావు యాదవ్ , వందే భారత్ రైలు గూడూరులో ఆగేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారని డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ బీద మస్తాన్‌రావు యాదవ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

### వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వేముల సునీల్

### అసత్య ప్రచారాలు మానుకోవాలి



గూడూరు( సింధూర దర్శిని) 18 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; అధికార పార్టీ ఎమ్మెల్యే అయిన కోట ఎస్సీ గురుకుల పాఠశాల పై అసెంబ్లీలో మాట్లాడిన వ్యక్తి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అని వాస్తవాలు తెలుసుకోకుండా ప్రతిపక్ష వైసిపి పార్టీ ఇన్చార్జ్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని సూపర్ సిక్స్ లో చెప్పిన పథకాలు అమలు చేసింది కూటమి ప్రభుత్వమని గూడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వేముల సునీల్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలుగు యువత ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వేముల సునీల్ మాట్లాడుతూ గురువారం జరిగిన వైసిపి సమావేశంలో నియోజకవర్గ ఇన్చార్జి గురవయ్య ఎమ్మెల్యే సునీల్ కుమార్ పై అసత్య ప్రచారాలు చేశారని గుర్తు చేశారు. ఎస్సీ గురుకుల పాఠశాల తరలింపు పై ఎమ్మెల్యే సునీల్ కుమార్ అసెంబ్లీలో మాట్లాడారని సంబంధిత మంత్రికి సమస్యను తెలియజేశారని, త్వరలోనే ఆ సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. అలాగే అభివృద్ధి పనులు ఏమీ జరగడం లేదని మాట్లాడారని సూపర్ సిక్స్ లో చెప్పిన విధంగా ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ నగదు జమ చేయడం జరిగిందని, ఉచిత బస్సు ప్రయాణం , ఉచిత గ్యాస్, పెన్షన్ల పెంపు అమలు చేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని కోరారు. ఈ సమావేశంలో వెంకటేష్, చరణ్, ప్రణీత్ యాదవ్ ,సాయి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి

### జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



నెల్లూరు( సింధూరదర్శిని)18 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; ఉద్యోగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధి తో కృషిచేస్తున్నామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో డీఆర్వో విజయ్ కుమార్..తో కలిసి ఉద్యోగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల గ్రీవెన్స్ డే ను కలెక్టర్ నిర్వహించారు.
ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను సమర్పించారు. ఉద్యోగుల సమస్యలను ఓపికగా ఆలకించిన కలెక్టర్, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.అలాగే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్ ప్రత్యేకంగా అర్జీలు స్వీకరించారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు, సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ గ్రీవెన్స్ లో అందిన ప్రతి అర్జీని పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఏ పీడి నాగరాజ కుమారి, సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి, బిసి సంక్షేమ శాఖ అధికారి వెంకట లక్ష్మి, డిసిఓ గుర్రప్ప, కార్మిక శాఖ అసిస్టెంట్ కమీషనర్ విజయ భాస్కర్ రెడ్డి, డీఎంఅండ్ హెచ్ఓ సుజాత, ఆర్టీసీ ఆర్ఎం షమీమ్‌తో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## నరేంద్ర మోడీ పాలనలో భారతదేశం ఎంతో అభివృద్ధి





### ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

గూడూరు(సింధూర దర్శిని)18 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలనలో భారతదేశం ఎంతో అభివృద్ధి సాధించిందని ప్రపంచ దేశాల్లోనే భారతదేశాన్ని నెంబర్ వన్ స్థానంలో ఉంచేందుకు నరేంద్ర మోడీ నిరంతరం కష్టపడుతున్నారని ఆయన సహకారంతో రాష్ట్రం కూడా ఎంతో అభివృద్ధి చెందు తుందని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణ సమీపంలోని ఆదిశంకర యూనివర్సిటీలో గురువారం నరేంద్ర మోడీ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా బిజెపి పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొనే రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ హాజరై విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత భారతదేశం ఎంతో అభివృద్ధి సాధించిందని ప్రపంచ దేశాలన్ని ఈరోజు భారతదేశం వైపు చూస్తున్నాయని అన్నారు. మోడీ సహకారంతో రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆయన పుట్టినరోజు వేడుకలు నెలరోజులపాటు పలు సేవా కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా జరపడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిజెపి పట్టణ అధ్యక్షులు దయాకర్ ,పనబాక కోటేశ్వరరావు, పురుషోత్తం రెడ్డి,బాలకృష్ణ నాయుడు,బిల్లు చెంచు రామయ్య, రహీం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలి: సి.ఐ.టి.యు నాయకులు డిమాండ్



గూడూరు( సింధూర దర్శిని) 18 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; మున్సిపల్ రంగంలో 14 రకాల పౌర సేవలను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేటీకరిస్తున్న దాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం ఏ.పి.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో గూడూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన ధర్నా చేపట్టడం జరిగింది. నాయకులు మాట్లాడుతూ దీనిపై మే,జూన్ నెలల్లో ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని ప్రభుత్వానికి నిరసనలు ద్వారా తెలియజేయడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం తన మొండి వైఖరితో ముందుకు వెళుతూ ఉందని, ప్రస్తుతం స్ట్రీట్ లైటింగ్‌కు సంబంధించి టెండర్లు ప్రక్రియ కొనసాగించేందుకు అన్ని మున్సిపాలిటీలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, ఇందులో భాగంగా గుంటూరు స్ట్రీట్ లైటింగ్ టెండర్లు పిలిస్తే ఈ. సి.ఎల్ అనే కంపెనీ టెండర్లు వేసిందని మిగతా చోట్ల కూడా ఈ ప్రక్రియ కొనసాగించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని, ఈ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిలుపుదల చేయాలని, మున్సిపల్ రంగంలో ప్రైవేటీకరణ విధానాలను ఉపసంహరించుకోవాలని హైకోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, స్ట్రీట్ లైటింగ్ విభాగంలో టెండర్లు ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే గూడూరు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు కాకి యూనిఫారం ఇచ్చి రెండు సంవత్సరాలు అయిందని, అలాగే కొబ్బరి నూనె,సబ్బులు, చెప్పులు కూడా సరిగా సంవత్సరానికి ఒకసారి కూడా ఇవ్వడం లేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి వారికి అవసరమైన సామగ్రిని వెంటనే అందచేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం గూడూరు మున్సిపల్ కమిషనర్ వై. మల్లికార్జున్ రావు కి వినత పత్రం సమర్పించడం జరిగింది. కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ యూనిఫారం, సబ్బులు, నూనె, చెప్పులు తదితర వస్తువులు సకాలంలో అందజేస్తామని హామి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సంఘం రాష్ట్ర నాయకులు ధారా కోటేశ్వరరావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు డి.మనేమ్మ, భూలోకం మురళి, గూడూరు పట్టణ సి.ఐ.టి.యు అధ్యక్ష,కార్యదర్శులు పామంజి మణి,బి.వి.రమణయ్య, కమిటీ సభ్యులు గండికోట మధు, గూడూరు మణి,అల్లం శాంతి వర్ధన్, పెంచలమ్మ, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రీ-సర్వేలో భాగంగా భూ రికార్డుల పరిశీలన

## రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి తగు చర్యలు చేపట్టాలి : జిల్లా కలెక్టర్ డా ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి (సింధూర దర్శిని) 18 సెప్టెంబర్ తిరుపతి జిల్లా ; రామచంద్రపురం / జిల్లాలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియలో భాగంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ డా. ఎస్. వెంకటేశ్వర్ శుక్రవారం రామచంద్రపురం మండలంలోని కమ్మపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించి భూ రికార్డులు, సర్వే నంబర్లు, భూ అనుభవ స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో రీ-సర్వే అనంతరం ఏర్పడిన కొన్ని భూ సంబంధిత అభ్యంతరాలు, సర్వే నంబర్లలో ఉన్న వ్యత్యాసాలు, భూముల అనుభవం, పట్టాదారు పాస్ పుస్తకాలు, అడంగల్ తదితర రికార్డులను కలెక్టర్ సంబంధిత రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా కుటుంబ వారసత్వ భూములకు సంబంధించి భూ విస్తీర్ణం, వివిధ సర్వే నంబర్లలో నమోదైన వివరాలు, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను రికార్డులతో సరిపోల్చి చూశారు. భూ వివాదానికి సంబంధించి గ్రామస్తులు, సంబంధిత భూ యజమానులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి అభ్యంతరాలను తెలుసుకున్నారు. సంబంధిత కుటుంబాలకు చెందిన పాత రెవెన్యూ రికార్డులు, కోర్టు సంబంధిత పత్రాలు, గతంలో నమోదైన భూ వివరాలు, ప్రస్తుత రీ-సర్వే రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. రీ-సర్వే సమయంలో వివాదాస్పదంగా ఉన్న కొన్ని సర్వే



నంబర్లను ఉమ్మడిగా నమోదు చేసిన అంశాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. భూమి వాస్తవ అనుభవం, పాత రికార్డులు, ప్రస్తుత రికార్డులు, భూ విస్తీర్ణం తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని సంబంధిత రెవెన్యూ అధికారులకు సూచించారు. రికార్డుల్లో వంటి స్పష్టత లేని నమోదులు ఉన్న సందర్భాల్లో వాటికి సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించి, వాటి వెనుక ఉన్న కారణాలను నిర్ధారించాలన్నారు. పాత రికార్డులను పరిశీలించడంతో పాటు క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను కూడా నిర్ధారించి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

భూ సమస్యల పరిష్కారంలో రికార్డులే ప్రధాన ఆధారమని, పాత రికార్డులు, ప్రస్తుత రీ-సర్వే వివరాలు, భూ అనుభవ పరిస్థితి తదితర అంశాలను సమన్వయంతో పరిశీలించిన అనంతరం మాత్రమే తుది నిర్ణయం తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. రీ-సర్వే ప్రక్రియ ఉద్దేశం భూ రికార్డులను మరింత స్పష్టంగా, పారదర్శకంగా రూపొందించడం అని పేర్కొన్న కలెక్టర్, ప్రజలకు ఎటువంటి సందేహాలు లేదా ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే మిట్టూరు గ్రామానికి చెందిన దళితుల అనుభవం లో వున్న సి జె ఎస్ భూములకు దరఖాస్తు పట్టాలను త్వరతగతిన మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం తహసీల్దార్ మధుసూదన్, ఎమ్ పి డి ఓ పులి రాం సింగ్, మండల స్వర్ణ గ్రామ అధికారి తేజోవతి, వీఆర్వోలు, సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్సులు, సంబంధిత అధికారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్ల నమోదు కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ

## అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందేలా ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించాలి: జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి (సింధూర దర్శిని) 18 సెప్టెంబర్ తిరుపతి జిల్లా ; రామచంద్రాపురం మండలం నెన్నూరు గ్రామ సచివాలయంలో జరుగుతున్న పింఛన్ల నమోదు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ శుక్రవారం ఆకస్మికంగా క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వికలాంగుల పింఛన్, వృద్ధాప్య పింఛన్, వితంతు పింఛన్, ఒంటరి మహిళా పింఛన్ తదితర సామాజిక భద్రతా పింఛన్లకు సంబంధించి నమోదు చేస్తున్న వివరాలను కలెక్టర్ పరిశీలించారు. అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ నిబంధనల మేరకు పింఛన్ అందేలా నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. వృద్ధాప్య పింఛన్లకు సంబంధించి లబ్ధిదారుల ఆధార్ కార్డులో నమోదైన పుట్టిన తేదీని సంబంధిత రికార్డులతో సరిచూసి నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు. పుట్టిన తేదీ వివరాల్లో ఏమైనా వ్యత్యాసాలు ఉంటే వాటిని నిబంధనల మేరకు పరిశీలించి సరిచేయాల్సిన చర్యలు చేపట్టాలని సూచించారు. వితంతు పింఛన్, ఒంటరి మహిళా పింఛన్‌కు సంబంధించి లబ్ధిదారుల అర్హతను నిర్ధారించేందుకు అవసరమైన ఆధారాలను తప్పనిసరిగా పరిశీలించాలని తెలిపారు. భర్త మరణించినట్లు ధ్రువీకరించే పత్రం, సంబంధిత కుటుంబ వివరాలు తదితర ఆధారాలను పరిశీలించిన అనంతరం మాత్రమే పింఛన్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులతో చర్చించారు. అదేవిధంగా వికలాంగుల పింఛన్‌కు సంబంధించి అర్హతను నిర్ధారించే ధ్రువ పత్రాలు, లబ్ధిదారుల వివరాలను పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. పింఛన్ల నమోదు ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా, అర్హత కలిగిన వారికి మాత్రమే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. లబ్ధిదారుల నుంచి స్వీకరించే దరఖాస్తులు, ఆధార పత్రాలు, నమోదు చేసిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎప్పటికప్పుడు రికార్డులను నవీకరించాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం తహసీల్దార్ మధుసూదన్, ఎంపిడిఓ పులి రాంసింగ్, మండల స్వర్ణ గ్రామ అధికారి తేజోవతి, వీఆర్వో, సర్వేయర్, పంచాయతీ కార్యదర్సులు, సంబంధిత అధికారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో మాతా శిశు మరణాలు జరగకుండా చూడాలి

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణ నాయక్

తిరుపతి (సింధూర దర్శిని) 18 సెప్టెంబర్ తిరుపతి జిల్లా; జిల్లాలో మాతా శిశు మరణాలు జరగకుండా ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ద చూపాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి బాలకృష్ణ నాయక్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక డిఎంహెచ్ఓ కార్యాలయం నందు జిల్లాలో ఆగస్టు నెలలో జరిగిన ఆరు శిశు మరణాలు మరియు ఒక్క మాతృ మ రణంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బాలకృష్ణ నాయక్, కమిటీ సభ్యులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాతా శిశు మరణాల పట్ల వైద్యాధికారులు ,సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని,బాల్య వివాహాల వలన, టీనేజి ప్రెగ్నెన్సీ సమయంలో కలిగే ఆరోగ్య సమస్యలు గురించి ఆశ వర్కర్లు, ఏ.ఎన్.ఎం.లు , శిశు సంక్షేమ శాఖా సిబ్బంది అవగాహన కల్పించాలి అని అన్నారు. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి పోహకారం లోపం లేకుండా చూడాలని, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు , వైద్య అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ఎప్పటికిప్పుడు వారి ఆరోగ్య స్థితిగతులను పరిశీలిస్తూ ప్రసూతి సమయం లో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి హై రిస్క్ కేసుల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టి సాదారణ ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు . ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ ఆనందమూర్తి డి.ఐ.ఓ డా. శాంత కుమారి, డిపిఎమ్ఓ డాక్టర్ తులసీదాస్, డి పి హెచ్ ఎన్ ఓ మంజుల, వైద్యం అందించిన మెటర్నిటీ హాస్పిటల్ ,రుయా హాస్పిటల్ డాక్టర్లు ,ప్రైవేటు ఆసుపత్రుల డాక్టర్లు ,శిశు మరణాలు జరిగిన పెనగలూరు , దామినేడు, గోవిందపాలెం, భాకరాపేట, తంబిళ్ళవారిపల్లి, మాతృ మరణం జరిగిన తారకరామ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎంఎల్ హెచ్ పి లు, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

### కల్పవృక్ష వాహన సేవలో కోవూరు ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



కోవూరు (సింధూరదర్శిని)18 సెప్టెంబర్ నెల్లూరుజిల్లా; కోవూరు శాసన సభ్యులు, టీటీడీబోర్డు సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తిరుమలలో జరుగుతున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. సెప్టెంబరు 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు కల్పవృక్ష వాహనంపై గోవుల గోపన్న అలంకారంలో దర్శనమిచ్చారు. కల్పవృక్ష వాహనంపై విశేష అలంకారంలో కొలువుదీరిన స్వామివారిని తిరుమాడ వీధుల్లో దర్శించుకున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, వాహనసేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు జానపద కళారూపాల ప్రదర్శనలను ప్రశాంతి రెడ్డి వీక్షించారు.

# అప్పుడూ...ఇప్పుడూ అభివృద్ధి మాతోనే

**ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**

**కూటమి పాలనలో ఊరూరా కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు**

**అభివృద్ధితో పాటు సంక్షేమానికి ప్రాధాన్యం**

**చంద్రబాబు నాయుడుకే సాధ్యం**

**ప్రజలకు జరుగుతున్న మంచిని చూసి ఓర్వలేక నోరు పారేసుకుంటున్న వైసీపీ నేతలు**

వెంకటాచలం( సింధూర దర్శిని) 18 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; వెంకటాచలం మండలం చెముడుగుంట పంచాయతీలో రూ.2.32 కోట్లతో పూర్తి చేసిన 12 అభివృద్ధి పనులకు ఎంపీ బీద మస్తాన్ రావుతో కలిసి ప్రారంభోత్సవం చేసిన సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి.ఒకేరోజు 12అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంతో చెముడుగుంటలో పండగ వాతారణం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి, ఎంపీ బీఎంఆర్‌కు ఆత్మీయ స్వాగతం పలికిన చెముడుగుంట పంచాయతీ ప్రజానీకం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ కోరిన వెంటనే నక్కల గిరిజనకాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు రూ.30లక్షలు మంజూరు చేశారు. ఎంపీ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాలు నక్కల కాలనీ వాసులకు ఉపయోగపడేలా అద్భుతంగా వచ్చింది. జాతీయ రహదారి నుంచి బురాన్ పూర్‌కు రూ.46లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మించాం. రూ.50 లక్షలతో గంగిరెడ్డి చెరువు బ్యూటిఫికేషన్ పనులు జరుగుతున్నాయి.పిల్లలకు పార్కు, వాకింగ్ ట్రాక్ అందుబాటులోకి వచ్చాయి. రూ.32లక్షలతో పంచాయతీ కార్యాలయం కట్టించాం అని, కుంకుమపూడిలో రూ.26 లక్షలతో సిమెంట్ రోడ్లు వేయించాం. నక్కల కాలనీ నుంచి బుజబుజనెల్లూరు వరకు జెడ్పీ నిధులు రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మించాం.జాతీయ రహదారి నుంచి బురాన్ పూర్ వరకు చెరువు కట్ట కింద రూ.8.50లక్షలతో గ్రావెల్ రోడ్డు వేశాం.

కుంకుమపూడి ఎస్సీ కాలనీలోని కమ్యూనిటీ హాలును రూ.5 లక్షలతో మరమ్మతులు చేయించాం.

నక్కలకాలనీలో రూ.5లక్షలతో అంగన్ వాడీ మరమ్మతులు చేయించడంతో పాటు మరో రూ.5లక్షలతో రచ్చబండ కట్టించాం. బురాన్ పూర్ మార్గంలో పైపుకల్వర్టును రూ.5 లక్షలతో వేయించాం.



చెముడుగుంటలో ప్రతి నెలా 503 మందికి 21.65 లక్షలు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందిస్తున్నాం. తల్లికి వందనం పథకం కింద 571 మందికి ఏడాదికి రూ.74.23 లక్షలు ఇస్తున్నాం.అన్నదాత సుఖీభవ పథకం కింద 132 మంది రైతులు ఏడాదికి రూ.26.40 లక్షలు అందుకుంటున్నారు. ఆటోడ్రైవర్లు 42 మందికి రూ.6.30 లక్షలు లబ్ధి చేకూరింది. దీపం పథకం కింద 1121 మందికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాం.

ఒక్క చెముడుగుంట పంచాయతీలోనే రెండున్నరేళ్లలో రూ.2.32 కోట్లతో అభివృద్ధి పనులు చేయడం, కోట్లాది రూపాయలతో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూర్చడం సంతోషంగా ఉంది.

అంతరాయం లేని విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ శాఖ పరిధిలో ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటు, స్తంభాలకు రూ.30 లక్షలు ఖర్చు చేశారు.

రూ.44.70 లక్షలతో ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పుడే కాదు 2014-19 మధ్య కూడా చెముడుగుంట పంచాయతీలో 9.07 కోట్లతో చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి పనులు చేశాం.రూ.4.70 కోట్లతో సిమెంట్ రోడ్లు, రూ.2.63 కోట్లతో ఇరిగేషన్ పనులు చేశాం.రూ.70 లక్షలతో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు, రూ.30 లక్షలతో నక్కలకాలనీలో తాగునీటి పథకం నిర్మించాం. రూ.29.53 లక్షలతో చెముడుగుంటలో ప్రజలకు వసతులు కల్పించాం.

రూ.17 లక్షలతో జెడ్పీ హైస్కూలులో అసంపూర్తి భవనాలు పూర్తి చేయించాం.

రూ.9లక్షలతో నక్కలకాలనీలో అంగన్ వాడీ కేంద్రం, రూ.7.50లక్షలతో చెముడుగుంటలో కమ్యూనిటీ హాలు కట్టించాం.

రూ.5.92లక్షలతో పంచాయతీ పరిధిలో ఎల్ఈడీ లైట్లు వేయించాం.అప్పుడూ, ఇప్పుడూ అభివృద్ధి మాతోనే....ఓవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమంతో ప్రజలు సంతోషంగా ఉన్నారు.

చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వైసీపీ నేతలు ఓర్చుకోలేక నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు.

ఎల్ నినో ను కూడా జగన్మోహన్ రెడ్డి రాజకీయాల కోసం వాడుకోవడం సిగ్గుచేటు అని రాష్ట్ర ప్రభుత్వం ముందే అప్రమత్తమైంది. సాగు, తాగునీరు వృథా కాకుండా అవసరమైన చర్యలు చేపట్టింది.నోర్లు పారేసుకోవడం వైసీపీ నేతలకు అలవాటుగా మారింది అని , 2023లో 1.10 లక్ష ఎకరాలకు 40 టీఎంసీల నీటిని వృథా చేసిన పెద్దమనుషులు కూడా మాకు సలహాలు ఇస్తున్నారు. ఒక విపత్తు వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా ఎదుర్కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు , కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# 60 ఏళ్ల కలకు శాశ్వత పరిష్కారం

**సర్వేపల్లి కాలువకట్ట వాసులకు పట్టాల పంపిణీకి లైన్ క్లియర్**

**మంత్రి నారాయణ చొరవతో 1215 కుటుంబాల్లో వెలగనున్న జీవన్ జ్యోతులు**

**ఈనెల 21న వర్చువల్ విధానంలో సీఎం చంద్రబాబు చేతులమీదుగా పట్టాల పంపిణీ**

నెల్లూరు( సింధూర దర్శిని) 18 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని సర్వేపల్లి కాలువకట్ట వాసుల 60 ఏళ్ల కల సాకారం కాబోతోందని డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం 1215 కుటుంబాలకు శాశ్వత పట్టాలు అందించే ప్రక్రియకు మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ లైన్ క్లియర్ చేశారని వెల్లడించారు. శుక్ర వారం నెల్లూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.సర్వేపల్లి కాలువకట్ట వాసులకు శాశ్వత పట్టాలు ఇప్పించేందుకు మంత్రి నారాయణ అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేస్తూ నిరంతరం కృషి చేశారని రూప్‌కుమార్ తెలిపారు. అధికారుల సూచనల మేరకు దేశంలో తొలిసారిగా గుజరాత్‌లోని అహ్మదా బాద్‌లో నర్మదా నది పరీవాహక ప్రాంత వాసులకు పట్టాలు ఇచ్చిన విధానాన్ని పరిశీలించి, అదే తరహాలో నెల్లూరు కాలువకట్ట వాసులకు కూడా న్యాయం జరిగేలా మంత్రి ప్రయత్నించారని చెప్పారు. మంత్రి నారాయణ చొరవతో ఈ నెల 3న రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం పొందిందని, దీంతో 1215 కుటుంబాలకు శాశ్వత పట్టాల పంపిణీకి మార్గం సుగమమైందన్నారు. ఈ నెల 20 వ తేదీ ఆదివారం ఉదయం 11.30 గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో పట్టాలను పంపిణీ చేయనున్నారని తెలిపారు. ఇందుకు సంబంధించి పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు.

**భగత్ సింగ్ కాలనీలోనూ 1400 కుటుంబాలకు పట్టాలు**

పేదల సమస్యలను పరిష్కరించడంలో మంత్రి నారాయణ ముందుంటున్నారని రూప్‌కుమార్ అన్నారు. గతేడాది భగత్‌సింగ్ కాలనీలో 1400 కుటుంబాలకు శాశ్వత పట్టాలు ఇప్పించిన విషయాన్ని గుర్తుచేశారు. పేదలకు అండగా నిలవాలన్న సంకల్పంతో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలను మంత్రి నారాయణ చొరవతో పరిష్కరిస్తున్నారని చెప్పారు.

**అసత్య ఆరోపణలతో ఉనికిని కాపాడుకునే ప్రయత్నం**

పేదల పక్షపాతిగా పనిచేస్తున్న మంత్రి నారాయణపై వైఎస్సార్‌సీపీ నేతలు సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారని రూప్‌కుమార్ విమర్శించారు. రోజుకో అబద్ధం చెప్పి తమ ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ నేతల దుర్మార్గాన్ని ప్రజలు గమనిస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుతోనే సమాధానం చెబుతారని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో నగర టీడీపీ అధ్యక్షుడు మామిడాల మధు, కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, టీడీపీ నేతలు బాలాజీ, తిరుమలనాయుడు, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ బహిరంగ చర్చకు రావాల్సిందే



**మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి**

నెల్లూరు( సింధూర దర్శిని) 18 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; నెల్లూరు సిటీ లోని విఆర్ సి కూడలి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద , రాష్ట్రంలో జరిగిన 1200 కోట్ల చెత్త దోపిడీ పై మంత్రి నారాయణ సమాధానం దాటవేస్తూ, వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ, శాసనమండలి సభ్యులు పర్వతరెడ్డి రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన తెలియజేసిన మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు “డా” కాకాణి గోవర్ధన్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి నారాయణ దోపిడీపై ఆధారాలు ఉన్నాయి.నెల్లూరు ప్రజలు, పేదల గొంతు మీద కత్తి పెట్టి బలవంతంగా పన్నులు వసూలు చేశారు.డబ్బులతో పనిలేదనే నారాయణ.. చెత్త లో దోపిడి పై సమాధానం ఎందుకు చెప్పడం లేదు? . ప్రెస్ మీట్లు పెట్టి దాటవేయడం కాదు.. ఆధారాలపై చర్చకు రావాలని కాకాణి సవాల్.

**నెల్లూరు వచ్చి చర్చకు రాకుండా పారిపోవడం మంత్రి చేతకానితనానికి నిదర్శనం.**

చెత్తలో జరిగిన దోపిడీని నగర ప్రజలకు సవివరంగా తెలియజేస్తాం.చంద్రశేఖర్‌రెడ్డి గత 3, 4 నెలలుగా కష్టపడి సేకరించిన అవినీతి ఆధారాలను ప్రతి సెంటర్‌లోనూ బయటపెడతాం. అధికార పార్టీ నేతలు మేకపోతు గాంభీర్యం ప్రదర్శించ కుండా బహిరంగ చర్చకు రావాలి. మా దగ్గర ఉన్న పక్కా ఆధారాలు చూస్తే నేతలు తల దించుకోవాల్సిందే . ఈ సందర్భంగా మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ నారాయణ దోపిడీపై ఆధారాలున్నా సమాధానం చెప్పడం లేదు. చెత్తలో జరిగిన దోపిడీకి సంబంధించి తమ వద్ద స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని మంత్రి నారాయణ చర్చకు వస్తే అన్ని ఆధారాలతో నిరూపిస్తామని స్పష్టం చేశారు.

**ప్రజలపై వేధింపులు..**

నెల్లూరు నగర ప్రజలు, పేదల గొంతు మీద కత్తి పెట్టి కరెంట్ కనెక్షన్లు తొలగించి, మంచినీటి సరఫరా నిలిపివేసి బలవంతంగా పన్నులు వసూలు చేశారని ఆరోపించారు.లెక్కలపై మౌనం.నాకు డబ్బుతో పని లేదు' అని చెప్పే మంత్రి నారాయణ, తాము అడిగిన పన్నుల వివరాలు మరియు లెక్కలపై ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారు. లెగసి చెత్త నిల్వలు రూ. 85 లక్షల నుండి ప్రారంభించి రూ. 1.65 కోట్లు, పెంచిన విధానం అవినీతి జరిగిన వివరాలను చంద్రశేఖర్ రెడ్డి మూడు, నాలుగు నెలలు కష్టపడి సేకరించి బహిరంగ పరిచామని తెలిపారు. తాము ఆధారాలతో సహా రోజులు తరబడి చర్చకు పిలుస్తున్న ప్పటికీ, మంత్రి నారాయణ ప్రెస్ మీట్లు పెట్టి మేము అంత దోచుకోలేదు అంటూ దాట వేస్తున్నారే తప్ప స్పష్టమైన వివరణ ఇవ్వలేకపోతున్నారని విమర్శించారు. నేను ఇంతకంటే పది రెట్లు కష్టపడతానని నారాయణ చెప్పడం 12 వందల కోట్లు కాదు 11 వేల కోట్ల దోచుకుంటాం అని చెప్పినట్లుగా ఉందన్నారు , ముందు నారాయణ తమ ప్రశ్నలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.నెల్లూరు ప్రజల సమక్షంలో చర్చకు రాకుండా పారిపోవడం మంత్రి నారాయణ చేతకానితనానికి నిదర్శనమని కాకాణి వ్యాఖ్యానించారు.

**నెల్లూరులో అవినీతికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ 'మెరుపు ధర్నా**

నెల్లూరు నగరంలో చెత్తలో జరిగిన అవినీతి, దోపిడీకి వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'మహనీయులు అంబేద్కర్ విగ్రహం వద్ద మెరుపు ధర్నా' కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు,వివరాల సేకరణ – బయటపెట్టేందుకు సిద్ధం.. చెత్తలో జరిగిన అవినీతి, దోపిడీకి సంబంధించిన ఆధారాలను, వివరాలను వైఎస్సార్‌సీపీ సేకరించిందని కాకాణి తెలిపారు. ఈ ఆధారాలన్నింటినీ నగర ప్రజల ముందుకు తెచ్చి, ప్రతి సెంటర్‌లోనూ నిరసన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.

**చర్చకు రావాలని సవాల్..**

అధికార పార్టీ నేతలు మేకపోతు గాంభీర్యం ప్రదర్శించకుండా, చెత్తలో జరిగిన దోపిడీపై బహిరంగ చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు.

**మహనీయుల విగ్రహాల వద్ద నిరసనలు..**

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు, పేద ప్రజల హక్కులను పరిరక్షించేందుకు అంబేద్కర్ గారు, ఇతర మహనీయుల విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ సేకరించిన సమాచారాన్ని పక్కా ఆధారాలతో వెరిఫై చేశామని పేర్కొంటూ, సహకరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు కాకాణి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా 9వ పోషణ మాసోత్సవాలు



గూడూరు (సింధూర దర్శిని) 18 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; చిల్లకూరు మండల పరిధిలోని పున్నపువారిపాలెం గ్రామంలోని థీమ్2 అంగన్వాడి కేంద్రం లో ఐసిడిఎస్‌సిడిపి ఓ షేక్. మెహబూబి ఆదేశాల మేరకు గర్భవతులకు, బాలింత లకు తల్లులకు, తాజా వేడి భోజనంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆహారం వండిన తరువాత, ఆహారం వండే ముందు చేతులు పరిశుభ్రంగా కడుకోవాలని తెలియజేశారు. వంటగది మరియు కేంద్రం లోపల బయట పరిశుభ్రంగా ఉండాలని, తాజా కూరగాయలు పరిశుభ్రమైన పాత్రలు ఉపయోగించి పిల్లలకు తాజా వేడి భోజనం తయారు చేయవలె నని శుక్రవారం మెనూలో ఉన్న ఎగ్‌రైస్ తయారుచేసి తల్లులకు చూపించి అందులో ఉన్న ప్రోటీన్ , పోషక విలువల గురించి తెలియజేశారు. పైవిధంగా తల్లులకు తాజా వేడిభోజనం పై అవగాహన కల్పించడం అయినదని తెలిపారు. ఈకార్యక్రమంలో సూపర్వైజర్ రేణుకమ్మ, అంగన్వాడి టీచర్లు కామాక్షమ్మ, సత్యవతి, నరసమ్మ, హెల్పర్ దివ్య, ఆశ వర్కర్ సుబ్బా రత్నమ్మ పాల్గొన్నారు.



# వినాయక విగ్రహాల నిమజ్జనానికి పటిష్ట భద్రతా ఏర్పాటు

నెల్లూరు (సింధూర దర్శిని) 18 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సుమారు 1,200 వినాయక విగ్రహాలు నిమజ్జనానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జిల్లా పోలీసు శాఖ విస్తృత భద్రతా చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల, ఆదేశాల మేరకు జిల్లా పరిధిలోని ఐదు పోలీసు సబ్ డివిజన్లలో సంబంధిత ఎస్‌డిపిఓల ఆధ్వర్యంలో ముందస్తు భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేస్తున్నారు. నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీసు అధికారులు, సిబ్బందిని ముందస్తుగా అప్రమత్తం చేశారు.జిల్లా వ్యాప్తంగా నిమజ్జన మార్గాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, నిమజ్జన ప్రదేశాల వద్ద అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు. 24×7 అత్యాధునిక డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేసి, జనసమూహాల కదలికలు, ట్రాఫిక్ పరిస్థితులు, నిమజ్జన కార్యక్రమాలను పర్యవేక్షణ.ఐదు సబ్ డివిజన్ల పరిధిలో ఎస్ డి పి ఓ లు , సిఐ, ఎస్సైలు మరియు ఇతర పోలీసు సిబ్బంది సమన్వయంతో ప్రత్యేక బందోబస్తు చర్యలు.నిమజ్జన విగ్రహాలు తరలించే మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల మళ్లింపు, పార్కింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి. నిమజ్జన ప్రాంతాల్లో అధిక రద్దీ ఏర్పడకుండా జనసందోహ నియంత్రణ చర్యలు చేపట్టడం.విగ్రహాల ఊరేగింపుల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా. అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే స్పందించేలా పోలీసు అధికారులు, సిబ్బందిని అప్రమత్తంగా ఉంచడం. నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనే నిర్వాహకులు, యువత మరియు ప్రజలు పోలీసులకు సహకరించి శాంతియుతంగా నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించేలా అవగాహన కల్పించడం. జిల్లా ఎస్పీ ఇప్పటికే సంబంధిత ఎస్ లు మరియు ఇతర పోలీసు అధికారులతో భద్రతా ఏర్పాట్లపై సమీక్షించి, నిమజ్జన కార్యక్రమాలు పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, సమన్వయంతో పనిచేసి వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా మరియు విజయ వంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసుశాఖ అన్ని ఏర్పాట్లుపూర్తి చేసింది.

# గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికేట్ అందుకున్న జిల్లా కలెక్టర్



చిత్తూరు( సింధూర దర్శిని) 18 సెప్టెంబర్ చిత్తూరు జిల్లా ; కుప్పం / అత్యధిక సంఖ్యలో ఎలక్ట్రిక్ సైకిళ్ల డెలివరీగా 3,742 ఎలక్ట్రిక్ సైకిళ్లను ఒక్క రోజులోనే పంపిణీ చేసి ఈ రికార్డును సాధించారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది. ఈ రికార్డును ఈ మోటో రాడ్ శుక్రవారం కుప్పం కడ కార్యాలయం నందు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కు,ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాన్పూర్,హరి శంకర్ ఆధ్వర్యంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్ అందుకున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ మరియు చిత్తూరు జిల్లా కలెక్టరేట్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (ఆల్ ఇండియా) సంయుక్తంగా సాధించాయి.

స్థలం: కుప్పం, ఆంధ్రప్రదేశ్, భారతదేశం

తేదీ: 31 జనవరి 2026

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో జనవరి 31, 2026న ఒకే రోజు 3742 ఎలక్ట్రిక్ సైకిళ్లను పంపిణీ చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు.కుప్పంలో ఈ–సైకిళ్ల పంపిణీ విశేషాలురికార్డ్ వివరాలు: 24 గంటల్లో అత్యధికంగా 3742 ఈ–సైకిళ్లను పంపిణీ చేయడంతో ఈ కార్యక్రమంగిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది.

# స్వామివారికి నూతన గొడుగులు సమర్పించిన కుమార్ స్వామి

**ఆలయ ఈవో పెంచల కిషోర్**

కాణిపాకం( సింధూర దర్శిని) 18 సెప్టెంబర్ చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం స్వామివారికి నూతన గొడుగులు సమర్పించిన వి. కుమార్ స్వామి నాయుడు , వారి కుటుంబ సభ్యులు చిత్తూరు వాస్తవ్యులు స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా నూతన 6 గొడుగులు సమర్పించడం జరిగింది, వీరికి స్వామి వారి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు



# సినిమా న్యూస్

## 'తుడక్కమ్' మూవీ రివ్యూ!



మోహన్ లాల్ కూతురు 'విస్మయ' ప్రధానమైన పాత్రను పోషించిన సినిమానే 'తుడక్కమ్'. మార్షల్ ఆర్ట్స్ నేపథ్యంలో రూపొందిన యాక్షన్ డ్రామా ఇది. జుడే ఆంథోని జోసెఫ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో, నిర్మాత ఆంటోని పెరంబవూర్ తనయుడు 'ఆశిష్ జో ఆంటోని' ఒక కీలకమైన పాత్రను పోషించాడు. గెస్టు రోల్ లో మోహన్ లాల్ మెరిసిన ఈ సినిమా, ఆగస్టు 7వ తేదీన విడుదలై 40 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అలాంటి ఈ సినిమా ఈ రోజు ( సెప్టెంబర్ 18) నుంచి 'జియో హాట్ స్టార్' లో స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగు ఆడియోలోను అందుబాటులో ఉంది.

'రవి బాలచంద్రన్' ( మలయాళ సాయికుమార్) విలేజ్ ఆఫీసర్ గా పనిచేస్తూ ఉంటాడు. రెండు కాళ్లూ చచ్చుబడి పోవడం వలన, వీల్ ఛైర్ లో కూర్చునే తన కార్యకలాపాలు నిర్వహిస్తుంటాడు. ఆయనకి పెళ్లీడు కొచ్చిన ఒక కూతురు ఉంటుంది. ఆ అమ్మాయి పేరే 'మీను' ( విస్మయ మోహన్ లాల్). తల్లిలేని పిల్ల కావడంతో ఆయన చాలా గారాబంగా పెంచుతాడు. ఊరికి దూరంగా ఉన్న ఇల్లు కావడం వలన, 'మెస్సి' అనే ఒక కుక్కను పెంచుతూ ఉంటారు. అక్కడికి దగ్గరలో జోసెఫ్ మాస్టర్ ఇల్లు తప్ప, మరెవరూ కనిపించరు. ఆయనే రవి ఫ్యామిలీకి అండ అని చెప్పుకోవాలి.

జోసెఫ్ మాస్టర్ కి ఒక తమ్ముడు ఉంటాడు. ఆస్తి విషయంలో అతను తరచూ అన్నతో గొడవపడుతూ ఉంటాడు. పెళ్లి చేసుకోకుండా ఒంటరిగా ఉంటున్న అతని కారణంగా తమకి ప్రమాదం ఉందని జోసెఫ్ భార్యకి ఒక అనుమానమైతే ఉంటుంది. ఆమె ఊహించినట్టుగానే ఆ ఫ్యామిలీని లేపేయాలని అతను నిర్ణయించుకుంటాడు. అందుకు సంబంధించిన ప్రయత్నాలు చేస్తుంటాడు.

'మీను'కి ధైర్య సాహసాలు ఎక్కువే. ఎదుటివారికి సాయం చేయడంలో ఆమె ఎంతమాత్రం వెనుకాడదు. అలాంటి ఆమె బ్యాంకు టెస్ట్ రాయడానికి వెళ్లి తిరిగి రాకపోవడంతో తండ్రి కంగారుపడుతూ ఉంటాడు. ఆమె ఫోన్ కి కాల్ కూడా కనెక్ట్ కాకపోవడంతో అతను తీవ్రమైన ఆందోళనకి లోనవుతాడు. ఆమెతో పాటు వెళ్లిన స్నేహితురాలు 'ప్రియ' కూడా ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం అతణ్ణి మరింత టెన్షన్ పెడుతూ ఉంటుంది.

ఆ చీకట్లో పోలీసులకు ఫిర్యాదు చేయడానికి స్టేషన్ కి వెళ్లిన రవిని, అక్కడి పోలీసులు పెద్దగా పట్టించుకోరు. ప్రియతో కాకుండా బస్సులో ఒంటరిగా వస్తున్న 'మీను', క్రిమినల్ తో గొడవపడుతుంది. చాలా తేలికగా హత్యలు చేసే అతను, తన వలలో పడవలసిన అమ్మాయిలను మీను తప్పించిందనే కోపంతో ఉంటాడు. కరడుగట్టిన ఆ నేరస్థుడి బారి నుంచి 'మీను' బయట పడుతుందా? ప్రియ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడానికి కారణం ఏమిటి? అనేది మిగతా కథ.

పొద్దుపోయినా కూతురు ఇంటికి తిరిగి రాకపోతే ఏ తండ్రికైనా చాలా టెన్షన్ గా ఉంటుంది. ఇక ఆ తండ్రి నిస్సహాయుడైతే, ఆందోళన మరింత ఎక్కువగా ఉంటుంది. ఆ కూతురు ఒక భయంకరమైన కిరాతకుడి కంట్లో పడితే .. అతనితో ఆమె గొడవపడితే ఏం జరుగుతుంది? ఒక ఆడపిల్లకి .. ఒక హంతకుడికి మధ్య జరిగే పోరాటం చుట్టూ నడిచే కథను దర్శకుడు చాలా పట్టుగా రాసుకున్నాడు.

నిస్సహాయుడైన ఒక తండ్రి .. అతను ప్రాణంగా చూసుకునే ఒక కూతురు, ఆస్తి తాలూకు గొడవలతో ఇద్దరు అన్నదమ్ములు ..ఆ మధ్య ఒక నరహంతకుడు. ఈ ఐదు పాత్రలతో దర్శకుడు ఈ కథను నడిపించుకుంటూ వెళ్లాడు. తండ్రీ కూతుళ్లు .. హంతకుడు .. ఈ మూడు పాత్రలు మరింత ప్రాధాన్యతను సంతరించుకుని కనిపిస్తాయి. ఈ సినిమా ఫస్టాఫ్ .. సెకండాఫ్ అన్నట్టుగా మనకి గుర్తుండదు. మొదలుపెట్టిన దగ్గర నుంచి పూర్తయ్యేవరకూ దృష్టిని మరో వైపు వెళ్లనీయదు.

'మీను' పాత్రకి కిల్లర్ తారసపడటం .. ఇద్దరి మధ్య గొడవ .. ఆమెను అతను ఫాలో కావడం .. వంటి సన్నివేశాలు సహజత్వానికి చాలా దగ్గరగా వెళుతూ ఉత్కంఠను రేకెత్తిస్తాయి. కిల్లర్ ఎప్పటికప్పుడు 'మీను'కి చాలా దగ్గరగా వస్తుంటాడు. ఆ సమయంలో ఆడియన్స్ గుండెదడ పెరగడం ఖాయమని చెప్పాలి. ప్రీ క్లైమాక్స్ .. క్లైమాక్స్ దగ్గరికి వచ్చేసరికి, ఏం జరుగుతుందో ఏమిటో అనే ఒక టెన్షన్ ఆడియన్స్ లో మొదలవుతుంది.

ఇటు మీను పాత్ర .. అటు కిల్లర్ పాత్ర ఈ రెండు కూడా ఈ కంటెంట్ కి రెండు కళ్ల మాదిరిగా కనిపిస్తాయి. అయితే కిల్లర్ పాత్రను డిజైన్ చేసిన తీరు ఎక్కువ మార్కులు కొట్టేస్తుంది. మొదటి నుంచి చివరి వరకూ కిల్లర్ పాత్రకి ఎక్కడా డైలాగ్స్ ఉండవు. సినిమా ఇంకో 10 నిమిషాల్లో పూర్తవుతుందనగా, ఓ రెండు మాటలు ఉంటాయంతే. అప్పటివరకూ ఆ పాత్ర చూపులతో .. బాడీ లాంగ్వేజ్ తోనే భయపెడుతుంది.

జోమన్ జాన్ ఫొటోగ్రఫీ .. జేక్స్ బిజోయ్ నేపథ్య సంగీతం .. చమన్ చాకో ఎడిటింగ్ ఈ కథకు అదనపు బలాన్ని అందించాయని చెప్పచ్చు. ఆసక్తికరమైన సన్నివేశాలే తప్ప, అనవసరమైన సన్నివేశాలు ఎక్కడా కనిపించవు. విస్మయ మోహన్ లాల్ కి ఇది ఫస్టు మూవీ అయినప్పటికీ గొప్పగా చేసింది. ఆశిష్ కూడా తన పాత్రలో మెప్పించాడు. మిగతా నటీనటులంతా తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు.

ఈ రోజులలో ఆడపిల్లలను బయటికి పంపించడమంటే, ప్రమాదంలోకి పంపించడం వంటిదేనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అలాగని వాళ్లను ఇంటికి పరిమితం చేయలేరు .. ఎప్పుడూ ఎవరో ఒకరు తోడుగా రానూ లేరు. అందుకే ఆత్మరక్షణ కోసం వాళ్లకి మార్షల్ ఆర్ట్స్ నేర్పించవలసిన అవసరం ఉందనే సందేశాన్ని ఇచ్చిన సినిమా ఇది. ఈ మధ్య కాలంలో వచ్చిన బెస్ట్ కంటెంట్ గా ఈ సినిమాను గురించి చెప్పుకోవచ్చు.

**సినిమా వివరాలు**

సినిమా పేరు: తుడక్కం
జానర్: యాక్షన్, డ్రామా
విడుదల తేదీ: 2026-09-18
తారాగణం: విస్మయ మోహన్‌లాల్, ఆశిష్ జో ఆంటోని, సాయి కుమార్, మోహన్‌లాల్, మనోజ్ కె జయన్
దర్శకుడు: జూడ్ ఆంథనీ జోసెఫ్
సంగీతం: జేక్స్ బిజోయ్
బ్యానర్: ఆశీర్వాద్ సినిమాస్
సమీక్ష: పెద్దింటి
తుడక్కం రేటింగ్: 5కి 3.00

## విశ్వంభర టీమ్ ఇప్పుడు చేయాల్సిందేమిటి?





ఒకే సంక్రాంతి.. ఒకే హీరో.. రెండు సినిమాలు.. మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు ఇది డబుల్ ట్రీట్ లా కనిపిస్తున్నా.. సినిమాల పరంగా అంత ఈజీ మ్యాటర్ కాదు. కాకా జనవరి 13న థియేటర్లలోకి రావడం ఖాయమైపోయింది. దీంతో ఇన్నాళ్లుగా సంక్రాంతి రేసుపై ఆశలు పెట్టుకున్న విశ్వంభర టీమ్ ఇప్పుడు అసలు నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. సంక్రాంతికే వస్తారా.. లేక ఇంకో డేట్ చూసుకుంటారా అనేదే ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. కాకా మూవీని 2027 జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు కేవీఎన్ ప్రొడక్షన్స్ రీసెంట్ గా మరోసారి అఫీషియల్ గా అనౌన్స్ చేసింది. అంతేకాదు.. త్వరలోనే ఫస్ట్ సింగిల్ కూడా రాబోతుందని చెప్పడంతో ఆ సినిమా రిలీజ్ పై ఎలాంటి కన్ఫ్యూజన్ లేదని క్లారిటీ ఇచ్చేసినట్లే. దీంతో సంక్రాంతి బరిలో కాకా ప్లేస్ ఫిక్స్ అయిపోయింది. అదే సమయంలో విశ్వంభర పరిస్థితి భిన్నంగా ఉంది. చాలా కాలంగా ఆ సినిమా రిలీజ్ కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. వీఎఫ్ఎక్స్, పోస్ట్ ప్రొడక్షన్ పనుల కారణంగా ఇప్పటికే పలుమార్లు విడుదల వాయిదా పడింది. గతంలో సంక్రాంతి 2027పై కూడా వార్తలు వచ్చాయి. జనవరి 9న విడుదల చేసే అవకాశం ఉందనే ప్రచారం జరిగినా.. మూవీ టీమ్ మాత్రం ఇప్పటివరకు అధికారికంగా తేదీ ప్రకటించలేదు. ఇప్పుడు కాకా డేట్ లాక్ కావడంతో విశ్వంభర విషయంలో అసలు సమస్య మొదలైంది. నాలుగు రోజుల తేడాతో రెండు చిరంజీవి సినిమాలు థియేటర్లలోకి వస్తే ఎలా ఉంటుందనేది ప్రశ్న. హీరో ఒక్కరే అయినా.. సినిమాలు రెండూ వేర్వేరు కథలు, జానర్లు. అయినప్పటికీ ప్రేక్షకుల దృష్టి, థియేటర్ల కేటాయింపు, షోల సంఖ్య వంటి విషయాల్లో రెండు సినిమాల మధ్య ఎఫెక్ట్ ఉండొచ్చనే చర్చ జరుగుతోంది. మరోవైపు విశ్వంభర ఇప్పటికే లేట్ అయిన సినిమా. అందుకే ఇంకాస్త ఆలస్యం చేయకుండా సంక్రాంతికే తీసుకురావాలని కొందరు భావిస్తున్నారు. కానీ అదే సమయంలో కాకాతో పోటీ పడటం ఎందుకనే ప్రశ్న కూడా వినిపిస్తోంది. ముఖ్యంగా చిరంజీవి సినిమాలే ఒకదానితో ఒకటి పోటీ పడే పరిస్థితి వస్తే అభిమానుల్లో అయోమయం ఏర్పడే అవకాశం ఉంది. అందుకే ఇప్పుడు విశ్వంభర టీమ్ ముందున్న మరో ఆప్షన్ సమ్మర్ రిలీజ్. సంక్రాంతి రేసు నుంచి తప్పుకుని మంచి డేట్ చూసుకుని వస్తే ఎలా ఉంటుందనే చర్చ జరుగుతోంది. ఇప్పటి నుంచే ప్రమోషన్స్ మొదలుపెట్టి.. టీజర్, ట్రైలర్, పాటలతో సినిమాపై హైప్ పెంచుతూ.. సోలోగా లేదా తక్కువ పోటీ ఉన్న సమయంలో థియేటర్లలోకి తీసుకురావడం ఒక ప్లాన్ గా ఉపయోగపడొచ్చనే అభిప్రాయాలు ఉన్నాయి. కానీ విశ్వంభర మరోసారి రిలీజ్ వాయిదా అంటే అభిమానులు మళ్లీ నిరాశ పడొచ్చు. కాబట్టి డేట్ మార్చినా.. ఆ డెసిషన్ ను కేవలం వాయిదాగా కాకుండా పక్కా ప్లానింగ్ తో తీసుకోవాల్సి ఉంటుంది. కొత్త తేదీని ముందుగానే ప్రకటించి, ప్రమోషన్స్ ను పక్కాగా నడిపించాల్సి ఉంటుంది. అలా ఇప్పటికే ఆలస్యమైన విశ్వంభర కు డేట్ కంటే సరైన డేట్ ముఖ్యమనే వాదన గట్టిగా వినిపిస్తోంది.



అనన్య నాగళ్ల ఫ్యాషన్ మనందరినీ మాట్లాడేలా చేసింది అనన్య నాగళ్ల ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక కొత్త పోస్ట్‌ను షేర్ చేసింది, అది తక్షణమే ఆమె అనుచరుల దృష్టిని ఆకర్షించింది.
అనన్య నాగళ్ల ఫ్యాషన్ మనందరినీ మాట్లాడేలా చేసింది అనన్య నాగళ్ల ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక కొత్త పోస్ట్‌ను షేర్ చేసింది, అది తక్షణమే ఆమె అనుచరుల దృష్టిని ఆకర్షించింది.

## ఎం.ఎస్.సుబ్బులక్ష్మి బయోపిక్.. ఎప్పుడొస్తుందో చెప్పేసిన నిర్మాత అల్లు అరవింద్!



ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు, భారతరత్న అవార్డు గ్రహీత ఎం.ఎస్.సుబ్బులక్ష్మి జీవితంపై తెరకెక్కుతున్న బయోపిక్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. 'ఎంఎస్ – ఏ లెగసీ ఆన్ స్క్రీన్' పేరుతో రూపొందుతున్న ఈ సినిమా విడుదల తేదీపై నిర్మాత అల్లు అరవింద్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. వచ్చే ఏడాది ఆగస్టు తర్వాత ఎప్పుడైనా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. చెన్నైలోని మ్యూజిక్ అకాడమీలో జరిగిన సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో అల్లు అరవింద్ ఈ విషయాన్ని వెల్లడించారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రష్మిక మందన్న ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. అనిరుధ్ సంగీతం అందించను న్నారు. ఎం.ఎస్.సుబ్బులక్ష్మి జీవితాన్ని కేవలం ఓ గొప్ప గాయని కథగా కాకుండా.. ఆమె వ్యక్తిగత జీవితంలోని మానవీయ కోణాన్ని చూపించాలనుకుంటున్నట్లు దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెలిపారు. ఇందుకోసం తమ బృందం ఏడాదిగా ఆమె జీవితంపై పరిశోధన చేస్తోందని చెప్పారు. ఆమె సాధించిన భారతరత్న, ప్రపంచవ్యాప్తంగా చేసిన కచేరీలు మాత్రమే కాకుండా.. ఓ కుమార్తెగా, కళాకారిణిగా, మహిళగా ఆమె ఎదుర్కొన్న విజయాలు, వైఫల్యాలు, త్యాగాలను సినిమాలో చూపించనున్నట్లు తెలిపారు. నేటి తరం యువతకు ఆమె జీవితం ఎంతో స్ఫూర్తినిస్తుందని గౌతమ్ అన్నారు. ప్రస్తుతం లైక్స్, షేర్స్, సబ్‌స్క్రైబర్లతో విజయాన్ని కొలుస్తున్న పరిస్థితుల్లో.. ఎం.ఎస్.సుబ్బులక్ష్మి క్రమశిక్షణ, సహనంతో జీవితకాలంలో సాధించిన గొప్పతనం యువతకు బలమైన సందేశమని పేర్కొన్నారు. గీతా ఆర్ట్స్, రాక్‌లైన్ ఎంటర్‌టైన్‌మెంట్, బన్నీ వాస్ వర్క్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662